

# పసిడిమనసులు - షర్మిల



## చిట్టి చెల్లెలు

**మల్లె పందిరి** దగ్గర పిన్ని, బుజ్జక్క పూలు కోస్తా ఎన్ని పూలు పూశాయో లెక్క పెడతన్నారు. పెద్ద గిన్నెడు పూలయ్యాక కొయ్యడం మానేశారు . " చిట్టిమ్మామ్మా ! ఈ మల్లె పాదు ఎక్కడి నుంచి తెచ్చావో గానీ పూలు కొయ్యలేక చేతులు పడి పోతన్నయ్యనుకో " అని బుజ్జక్క చేతులు నొక్కుకుంటా అంది .

" దీని అంటు కట్టాను నీకే ఇస్తాలే , పూలకి అసలే వాసిపోతావు" అని చిట్టెమ్మ అంది.

"అబ్బే ! నాక్కాదు అక్కాయి గారు అడిగారు ఆవిడకి ఇస్తా" అంది బుజ్జక్క.

అక్కాయిగారి ఆయనకి మా పక్కూరి కరంట్ ఆఫీసులో వుద్యోగం.

మా తమ్ముడు నన్ను "అక్కా !" అని పిలిచినప్పుడల్లా నేను ఆవిడలా వాలు జడతో వున్నా గావున్ను అని అద్దంలో చూసుకునే దాన్ని. కానీ నేను అక్కాయి గారిలా కనబడలా.

నాకన్నీ ప్రశ్నలే అని అందరూ నేనేం అడిగినా ఏదో ఒకటి చెప్పేస్తారు.

రేడియోలో మనుషులుంటారా అని అడిగితే అవునన్నారు. ఇంగ్లీష్ వార్తలు ఎవరు చదువుతారంటే ఇందిరాగాంధీ అన్నారు. మా ఇంట్లో వున్న పెద్దరేడియో వెనక్కి వెళ్లి తొంగి తొంగి లోపలకి చూస్తే మనుషులు ఏనాడూ కనబడలేదు .

కోసిన పూలన్నీ పెద్ద చెండు కట్టి మల్లెచెండు పిన్ని తల్లో పెట్టింది నాయనమ్మ.

పిన్నిది చాలా పెద్ద జడ. ఈ మధ్య పిన్ని పొట్టతో తిరుగుతాంటే ఎంటో అనుకున్నా లోపల బాబో పాపో వున్నారంట.

ఒక రోజు చిట్టెమ్మ కంగారుగా కోటేశుని సైకిలేసుకుని ఎళ్లి అన్నపూర్ణమ్మామ్మని కేకేసుకు రమ్మని పంపింది.

ఈలోగా రిక్షా కూడా వచ్చింది. పిన్నిని ఎక్కించి పక్కూళ్లో వున్న ఆసుపత్రికి పంపింది .

రిక్షా వెనకాలే అన్నపూర్ణమ్మ పరిగెత్తుకుంటా వెళ్లింది.

ఇంట్లో పనులన్నీ గబగబా చేసుకుని తమ్ముడిని ఇల్లు తాతకి అప్పచెప్పి నన్ను తీసుకుని ఆసుపత్రికి బయల్దేరింది.

" బాబాయి ఎప్పుడొస్తాడమ్మా?" అనడిగాను.

"ఏమోనే తల్లి ఆడు ఇక్కడుంటే నాకు ధైర్యంగా వుండేది ఆఫీసు సెలవు ఇవ్వగానే వస్తాడు " అంది .

మేం వెళ్లేసరికి పిన్నిని లోపలికి తీసుకెళ్లారు. మేం వసారాలో బల్ల మీద కూర్చున్నాం. కాసేపటికి పాప పుట్టిందని చెప్పారు.

" నీకు చెల్లి పుట్టిందే ! " సంబరంగా అంది చిట్టెమ్మ.

కాసేపటికి పిన్నిని మాత్రం బయట గదిలో వున్న మంచం మీద పడుకోబెట్టారు. నేనూ చిట్టెమ్మా ఆత్రంగా పిల్లని చూడడానికి లోపలకి ఎళ్లాం.

పాప తెల్లగా వత్తయిన జుట్టుతో ఎంత బాగుందో! కానీ కళ్లు తెరవలేదు. పాప ఆగకుండా ఎక్కిళ్లు పెడుతుంటే చిన్ని డొక్కలు ఎగిరిపడుతున్నాయ్ .

నాయనమ్మ పిల్లని తన వళ్లో పెట్టుకుంది .

డాక్టర్ వచ్చి " ఆక్సిజన్ కావాలమ్మా మా దగ్గర లేదు. పోనీ బెజవాడ నుంచి తెప్పిద్దామన్నా నమ్మెం అంట" అని చెప్పింది .

పిల్లని అట్లాగే గంటలు గంటలు వళ్లోనే పెట్టుకుని కూర్చుంది. నేను పిన్ని దగ్గరికి వెళ్లాను పిన్ని పైకప్పుకేసి చూస్తూ ఏమీ మాట్లాడలేదు. కొన్ని గంటలయ్యాక పాప ఎక్కిళ్లు ఆగి పోయాయి. నాయనమ్మ ఎక్కెక్కి ఏడ్చింది.

కొంతసేపటికి డాక్టర్ అంది " అమ్మా ! ఆయాకి బిడ్డని ఇస్తే తీసికెళ్తుంది " అని .

ఈలోగా ఆయా ఒక బుట్ట తీసుకుని పిల్లని ఇమ్మంటా వచ్చింది .

నాకు ఎక్కడ చిట్టెమ్మ పాపని ఇచ్చేస్తుందేమో అని బయ్యం వేసింది .

" ఇవ్వద్దమ్మా అట్టిపెట్టేసుకుందాం, ఎప్పుడైనా కళ్లు తెరుస్తుందెమో " అని ఏడ్చాను .

కానీ అయా పాపని బుట్టలో పెట్టుకుని పట్టికెళ్లి పోయింది .

ఏమనుకుందో నన్ను పెద్దనాన్న ఇంటికి పంపేసింది. పెద్దమ్మకీ విషయం తెలిసినా వాళ్లేమీ ఏడవలేదు .

"పురిట్లోనే పిల్ల పోయిందమ్మా" అని మాత్రం చెప్పుకున్నారు .

కానీ నాకు కళ్లనుంచి నీళ్లు కారుతూనే వున్నాయ్. ఆళ్లు చూస్తే నవ్వుతారేమో అని పక్కగదిలోకి ఎళ్లి దొంగచాటుగా కళ్లనీళ్లు తుడుచుకున్నాను. పాప ముద్దు మొహమే గుర్తొస్తొంది. ఎవరికి చెప్పాలన్నా ఇది పెద్ద ఆరిందా కబుర్లు చెప్తుంది అనుకుంటారేమో అని చెప్పలేదు.

మళ్లీ మా పిన్ని చిట్టెమ్మ ఇంటికి వచ్చేవరకు బెంగగానే వుంది. పిన్ని వచ్చాక పిన్ని పక్కనే కూర్చున్నా .

" పిన్నీ! నేను చెప్పాను పాపని వుంచేసుకుందాం పారెయ్యొద్దని, ఇదుగో ఈ నాయనమ్మే ఇచ్చేసింది." అప్పుడివరకు నేను అనుకున్నవన్నీ చెప్పేశాను. అప్పటి వరకు దిగులుగా మాట్లాడకుండా కూర్చున్న పిన్ని ఒకేసారి ఏడ్చింది.

" ఏడువమ్మా నిన్నటి నుంచి బిగబట్టుకున్నావ్ , ఇక గుండె తేలిక చేసుకో ఆ పిల్లకి ఆయువు లేదు, నీకు పండంటి బిడ్డలు పుడతారు" అంటా ఓదార్చింది .

నేను మాత్రం కళ్లయినా తెరిచి నన్ను చూడనైనా చూడని నా చిట్టి చెల్లిని చాన్నాళ్లు మర్చిపోలేదు

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments